చంద్రబాబు ఓ మోసకారి

- బాబు మోసాలను నాయకులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు


కంచికచర్లలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ జగన్‌మోహన్‌రావు, నాయకులు

కంచికచర్ల: కూటమి ప్రభుత్వం ఏడాది నుంచి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తోందని, చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలదేనని వైఎస్సార్ సీపీ నందిగామ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. వైఎస్సార్ సీపీ కంచికచర్ల పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు బండి మల్లికార్జున రావు అధ్యక్షతన మండల, పట్టణ స్థాయిలో బాబూ ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలు కూటమి నాయకులు చెప్పిన అబద్ధపు మాటలు నమ్మి ఓట్లేసి గెలిపించారని, కానీ ఆ మోసపు మాటలు నమ్మిన ప్రజలకు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి నేతలు ప్రజలను నట్టేట ముంచారన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి విఫలమైందన్నారు. పార్టీ కార్యకర్తలే వైఎస్సార్ సీపీ మనుగడకు కీలకమన్నారు. పార్టీ బలోపేతం కోసం నిబద్ధతతో పనిచేస్తే కార్యకర్తలకు మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కూటమి నాయకులు అధికారంలోకి రాక ముందు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. కానీ ఆ పథకాలు అమలు కావట్లేదని పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా నందిగామను ఎంతో అభివృద్ధి చేశామని జగన్‌మోహనరావు అన్నారు. 100 పడకల ఆస్పత్రి, కేంద్రీయ విద్యాలయం, సీఎం రోడ్డు, రామన్నపేట, చందర్లపాడు రోడ్ల విస్తరణ అభివృద్ధి పనులు, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలకు తాగునీటి వసతి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నందిగామ ఏమైనా మహా పట్టణమా అభివృద్ధి చేయడానికి అని ఎద్దేవా చేశారన్నారు. అనంతరం చంద్రబాబు మోసాలపై క్యూర్ కోడ్ స్కానర్ గురించి కార్యకర్తలకు వివరించారు.

మహిళలపై వివక్ష చూపుతున్న కూటమి ప్రభుత్వం..

రాష్ట్రంలోని మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తానన్న కూటమి ప్రభుత్వం నేడు మహిళల అభ్యున్నతికి ద్రోహం చేస్తోందని జెడ్పీటీసీ సభ్యులు వేల్పుల ప్రశాంతి అన్నారు. ఆడబిడ్డ నిధి, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకు పింఛన్, మహిళల డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు మహిళలపై వివక్ష చూపుతున్నారన్నారు. రానున్నకాలంలో చంద్రబాబుకు మహిళలే తగిన బుద్ధి చెబుతారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాలవ వాసుదేవరావు, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాథరావు, ఎంపీటీసీ సభ్యులు మాడుగుల మధుబాబు, జిల్లా పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మార్త శ్రీనివాసరావు, నాయకులు కాలవ పెదబాబు, మాడుగుల కోటేశ్వరరావు, మాడుగుల సన్నీ గండేపల్లి సర్పంచి బొక్కా రవికుమార్, శివనాయక్, చాన్‌బహుదూర్, వెలగలేటి బాబు, వాసు, బుడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు


పేటలో కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, వారికి కనీస వేతనం రూ 26 వేలు చెల్లించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని సోమవారం తన్నీరు నాగేశ్వరరావు సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత వారం రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కళ్లు తెరచి సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు న్యాయం జరిగే వరకు వారికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, తమ మద్దతు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు దివ్వెల రామారావు, నేతలు పెంటి శ్రీనివాసరావు, నంబూరి రవి, బాణావత్ రాజు, దర్శి వెంకటేశ్వర్లు, సత్యశ్రీనివాసరావు, అమ్మనబోయిన గోపి, పిడమర్తి ప్రభు, మన్నె అప్పారావు, షేక్ ఖాదర్‌బాబు పాల్గొన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ వట్టెం మనోహర్ సందర్శించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ తులసి కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గంగోలు వినోద్‌కుమార్, పట్టణ ప్రచార కమిటీ అధ్యక్షుడు గోగుల వెంకయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి స్పందించని ప్రభుత్వం..

నందిగామరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఆర్డీవో బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. నాయకులు పరిమి రవి, శ్రావణ్‌కుమార్, అశోక్ కుమార్, కండెల శ్రీను, దాసు, బ్రహ్మం, ఆనంద్ ఇల్లూరి పాల్గొన్నారు.

డివిజన్‌లో 113.8 మి.మీ.ల వర్షపాతం

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల పరిధిలో ఆదివారం 113.8 మి.మీ.ల వర్షపాతం నమోదైందని ఉప గణాంకాధికారి ప్రసాద్ సోమవారం తెలిపారు. కంచికచర్ల మండలంలో అత్యధికంగా 48.6 మి.మీ. వర్షం కురవగా వత్సవాయి మండలంలో అత్యల్పంగా 2.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. నందిగామ నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 94 మి.మీ. వర్షం కురవగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 19.8 వర్షపాతం కురిసిందని తెలిపారు. నందిగామ మండలంలో 3.4 మి.మీ., చందర్లపాడు మండలంలో 12.6 మి.మీ., వీరులపాడు మండలంలో 29.4 మి.మీ. వర్షం కురిసింది. జగ్గయ్యపేట మండలంలో 10.4 మి.మీ., పెనుగంచిప్రోలు మండలంలో 6.8 మి.మీ.ల వర్షం కురిసిందన్నారు.

ఆహార వ్యాపారులకు సర్టిఫికెట్ల అందజేత

జగ్గయ్యపేటఅర్బన్: పాన్ ఇండియా ఫుడ్ సేఫ్టీ పార్టనర్ కేవీజీవీఎం ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రతా సంస్థ(ఫాసి) ఆమోదించిన ఫాస్టాక్ శిక్షణా కేంద్రంలో శిక్షణ తీసుకున్న జగ్గయ్యపేట పట్టణ ఆహార వ్యాపారులకు సర్టిఫికెట్లను అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సర్టిఫికెట్‌లను అందజేశారు. శిక్షణ పొందిన వారు వ్యాపార నిర్వహణలో నాణ్యత, శుభ్రత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా ఫాస్టాక్ ఇన్‌చార్జి అధికారి మోహన్‌బాబు, మున్సిపల్ కమిషనర్ టీవీఎస్.కృష్ణారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీవో నితిన్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైందని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తాగునీరు, డ్రెయినేజీల్లో పూడిక తీతలు తీయటంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని తెలిపారు. పీ – 4 సర్వే కూడా పూర్తి చేసిన గ్రామాల్లో బంగారు కుటుంబాలను ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన పార్టీని టీడీపీ ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు


మీడియాతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో తమ పార్టీకి తీవ్రం అన్యాయం జరుగుతుందని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్, ఆ పార్టీ నాయకుడు షౌకత్‌అలీ సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేట నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తమ పార్టీని పట్టించుకోవడంలేదని వాపోయారు. నియోజకవర్గంలో పదవుల పంపకం దగ్గర నుంచి ఏ చిన్న పని కావాలని అడిగినా స్థానిక ఎమ్మెల్యే తమను విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే తాతయ్య గెలుపు కోసం అలుపెరుగని కృషి చేశామని తెలిపారు. తీరా ఆయన గెలిచాక జనసేన కార్యకర్తలు, వీర మహిళలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాము ఎమ్మెల్యేను ఎన్నోసార్లు కలిసి పలానా పని చేయండి అని అడిగిన ప్రతిసారి చేద్దాం ...చూద్దాం...అని తప్పించుకుంటున్నారని తెలిపారు. అలాగే పనుల కోసం ఏ డిపార్టుమెంట్‌కు వెళ్లినా ఎమ్మెల్యే లేదా ఆయన సోదరుడితో చెప్పించండి అంటూ అధికారులు సమాధానం చెబుతున్నారన్నారు. ఏ ప్రభుత్వ కార్యక్రమం జరిగినా ఆహ్వానించడం లేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జనసేన పేట, పెనుగంచిప్రోలు మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, పెద్ద సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ పెనుగంచిప్రోలు మండల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక మునేరు అవతల హరి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పాన్నం కోటేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమానికి జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ తన్నీరు నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.





భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ



పెనుగంచిప్రోలు: ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మ వారికి సోమవారం మండలంలోని ముచ్చింతాల, ముండ్లపాడు గ్రామానికి చెందిన భక్తులు సారె సమర్పించి బోనాలు చెల్లించారు. అమ్మవారికి సారె సమర్పణ అనంతరం వారికి వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సత్యమ్మ అమ్మవారికి సారె..

నందిగామరూరల్: మండలంలోని అంబారుపేట గ్రామంలో వేం చేసి ఉన్న సత్యమ్మ అమ్మవారికి అంబారుపేట గ్రామస్తులు సోమవారం ఆషాఢం సారె సమర్పించారు. గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు, కుంకుమ, చీర, జాకెట్, పండ్లు, చలిమిడి, గాజులతో కూడిన సారెను మేళతాళాలతో వేద మంత్రోచ్ఛరణల నడుమ అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. ముందుగా అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం గ్రామ బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈవో పవన్‌కళ్యాణ్, పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు

జగ్గయ్యపేటఅర్బన్: లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట, డాక్టర్ వైఎస్ జగన్‌మోహనరావు మెమోరియల్ చైల్డ్ కేర్ వారి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య నిపుణురాలు డాక్టర్ టి.సునీత పర్యవేక్షణలో వైద్య బృందం 720 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 20 మందికి కళ్లజోళ్లు అవసరం ఉందని గుర్తించారు. లయన్ శ్రీరాం బదరీనారాయణ ఆర్థిక సహాయంతో కళ్లజోళ్లను అందజేయనున్నట్లు క్లబ్ కార్యదర్శి షేక్ ఖాసిం సైదా తెలిపారు. పూర్వపు గవర్నర్ లయన్ దేవినేని కిషోర్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరాం బదరీనారాయణ, కార్యదర్శి షేక్ ఖాసిం సైదా, కోశాధికారి రవికుమార్, ఉపాధ్యక్షుడు కరుణాకర్, స్కూల్ హెచ్ఎం పీవీ.నాగేశ్వరరావు, ప్రాజెక్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ గాంధీ, ఏసీవీ.సత్యనారాయణ, నారాయణరెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి చర్యలు

నందిగామటౌన్: డ్రగ్స్ రహిత సమాజం కోసం ఈగల్ టీం నిరంతర కృషి చేస్తుందని ఎస్ఐ అభిమన్యు పేర్కొన్నారు. సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏసీపీ తిలక్ ఆదేశాలతో స్థానిక డీవీఆర్ కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, శక్తి యాప్ వాడకం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావం, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, తదితర అంశాలపై సోమవారం ఆయన అవగాహన కలిగించారు.

పారిశుద్ధ్య మెరుగుదలకు కృషి చేయాలి

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీడీవో రాజు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలోని మండల పరిషత్ కారాయలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు నీరు పారుదలయ్యేలా కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలన్నారు. నీటి నిల్వ ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాలలో దోమల వ్యాప్తిని అరికట్టేలా మలాథీన్, ఎబేట్ మందులను పిచికారీ చేయించాలని సూచించారు.





ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 18 అర్జీలు

నందిగామరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో బాలకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. 18 అర్జీలు అందాయన్నారు. ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.10,116 విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వేగినేటి చంద్రశేఖర్ రూ.10,116 విరాళాన్ని ఆలయ ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ లక్ష్మణ్‌కు సోమవారం అందజేశారు. దాతను ఆలయ అధికారులు సత్కరించారు. మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల మండల కమిటీ ఎన్నిక

పెనుగంచిప్రోలు: ఆశ వర్కర్ల మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.జ్యోతి, యు.రాహేలుతో పాటు 11 మందితో కూడిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. స్థానిక మునేరు అవతల హరి గార్డెన్స్‌లో యూనియన్ నాయకురాలు టి సత్యవతి అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల మాట్లాడుతూ.. ఆశ వర్కర్లతో సంబంధం లేని పనులు చేయించరాదని పలుమార్లు అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. నాణ్యమైన ఫోన్లు, సిమ్‌లు ఇవ్వాలన్నారు. వర్కర్ల వయో పరిమితితో పాటు వేతనాల పెంపు చేయాలన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

జగ్గయ్యపేట: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని తపోవన్ విద్యాలయం ప్రిన్సిపాల్ సుధీర్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కడప జిల్లాలో సౌత్ ఇండియా ఇన్విటేషనల్ కరాటే చాంపియన్‌షిప్–2025 పోటలు నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు మహదేవ్, ప్రణయ్ కీర్తన్, అభిషిక్త్, ఆశిష్, కార్తికేయ, మోక్షజ్ఞ, దమరేశ్వర్ పతకాలు సాధించారన్నారు. కరాటే కోచ్ పూజ, విద్యార్థులను అభినందించారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

నందిగామటౌన్: పట్టణంలో వేం చేసి ఉన్న సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. స్వామి, అమ్మవారిని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరీగా అలంకరించారు. ఆలయ అర్చకుడు దివి వంశీ శశి కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈవో నరసింహమూర్తి పర్యవేక్షించారు.

